పోలింగ్‌పై అనాసక్తి

- ఎన్నికలకు దూరంగా రైల్వే ఓటర్లు!
- అదే బాటలో కాలనీవాసులు
- లష్కర్‌లో ఫలితమివ్వని అవగాహన కార్యక్రమాలు
- పోలింగ్ శాతం పెంచుతామంటున్న అధికారులు



సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ ఓటర్లు ఊహించిన స్థాయిలో ఓటింగ్‌లో పాల్గొనడం లేదు. ప్రతి ఎన్నికల్లో ఇక్కడ తక్కువ మొత్తంలో పోలింగ్ నమోదవ్వడమే ఇందుకు ఉదాహరణ. లోగడ జరిగిన 3 శాసనసభ, లోక్‌సభ ఎన్నికల తీరును పరిశీలిస్తే మొత్తంగా 57 శాతానికి మించి పోలింగ్ నమోదు కాలేదు. నియోజకవర్గం మొత్తంలో బస్తీలు, సంపన్నుల కాలనీలు, రైల్వే కాలనీలు కలిసి ఉన్నాయి. ఎన్నికలు జరిగినపుడల్లా బస్తీలలో ఎక్కువశాతం ఓట్లు పోలవుతుండడం, కాలనీలు, రైల్వే కాలనీల్లో అంతంత మాత్రంగా ఓటు హక్కును వినియోగించుకుంటున్నారు. పోలింగ్ శాతం తగ్గుతుండడంతో ఏ పార్టీ అభ్యర్థులకు ఎంతమేర లాభం చేకూరుతుందో అంతుపట్టని పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ సందర్భాలు ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇక్కడి కాలనీల ప్రజలు మందకొడిగా పోలింగ్ కేంద్రాలకు వస్తుండగా.. సుమారు 40 వేల వరకు ఉన్న రైల్వే కాలనీలు, కుటుంబాలకు చెందిన ఓటర్లు పోలింగ్‌స్టేషన్లకు రావడానికి ఆసక్తి చూపించడం లేదు. ముఖ్యంగా తార్నాక, మెట్టుగూడ డివిజన్లలోని కాలనీవాసులు, విద్యావంతులు, రైల్వే కుటుంబాలకు చెందిన ఓటర్లు పోలింగ్‌కు దూరంగా ఉంటున్నారు. అడ్డగుట్ట, బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లలో బస్తీలు, వెనుకబడిన ప్రాంతాలు ఎక్కువగా ఉన్న కారణంగా ఇక్కడ చెప్పుకోదగిన స్థాయిలో ఓటింగ్ జరుగుండడం గమనార్హం.

అవగాహన కల్పించినా..

ఎన్నికల సందర్భంగా పోలింగ్ శాతం తక్కువ ఉంటున్న ప్రాంతాలను గుర్తిస్తున్న ఎన్నికల అధికారులు ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయా ప్రాంతాల్లో ప్రచారాలు చేస్తున్నారు. ఎన్నికల సందర్భాల్లో ఆయా కాలనీల పెద్దలు, రైల్వే కాలనీల ప్రతినిధులను సంప్రదించి సదస్సులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ పోలింగ్‌శాతం అంతంతమాత్రంగా ఉంటుండడం గమనార్హం. ఓటర్ల జాబితాలో పేర్లు నమోదు చేయించడం మొదలు.. పోలింగ్ సందర్భంలో ఇంటింటికీ వెళ్లి పోల్ చీటీలు పంపిణీ చేసి పోలింగ్ కేంద్రాలను రావాలని పిలుపునిస్తున్నారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు కాలనీల్లో విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ సదరు ఓటర్లు పోలింగ్ సమయంలో ముఖం చాటేస్తున్నారు.

ఎమ్మెల్యే ఎన్నికల్లో....

2009 శాసనసభ ఎన్నికల్లో నియోజకవర్గం మొత్తంమీద 55.30 శాతం పోలింగ్ నమోదైంది. 2014లో 57 శాతం, 2018లో 55.38 ఓటింగ్ మాత్రమే జరిగింది. రైల్వే కుటుంబాలు నివసిస్తున్న ప్రాంతాలు, రైల్వే కాలనీల్లో మరీ తక్కువగా ఓటింగ్ ఉంటుంది. రైల్వేగూడ్స్ షెడ్ ఏరియాలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో 29 శాతానికి మించి పోలింగ్ కావడం లేదు. ఇలాంటి 34 కేంద్రాల్లో పోలింగ్ 35 శాతానికి మించడం లేదు. నియోజకవర్గంలో పేద, మధ్యతరగతి ప్రజలు నివసించే 126 పోలింగ్ కేంద్రాల్లో మాత్రం గడచిన ఎన్నికల్లో 50 నుంచి 59 శాతం పోలింగ్ ఉంటుంది. బౌద్ధనగర్ డివిజన్‌లోని న్యూ అశోక్‌నగర్‌కు చెందిన రెండు పోలింగ్ కేంద్రాల్లో మాత్రం అత్యధికంగా 75 శాతం ఓటర్లు పోలింగ్‌లో పాల్గొంటున్నారు.

అత్యల్పం మెట్టుగూడ...

గడచిన రెండు మూడు ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల సందర్భంలో పోలింగ్ శాతాన్ని పెంచడం కోసం పలు ప్రచారాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎప్పటిమాదిరిగానే మెట్టుగూడ డివిజన్ ఓటర్లు తక్కువ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు వస్తుంటారు. మెట్టుగూడలో ఎక్కువ శాతం రైల్వే కుటుంబాలు, కాలనీలు ఉండడమే ఇందుకు కారణం. నియోజకవర్గంలోని ఐదు డివిజన్లలో మెట్టుగూడ డివిజన్‌లోనే ఎప్పుడు పోలింగ్ అత్యల్పంగా జరుగుతుండడం గమనార్హం. మెట్టుగూడ డివిజన్‌లో పలు కాలనీలు, రైల్వే కాలనీలు ఉండగా ఆలుగడ్డబావి, పాత మెట్టుగూడ వంటి ప్రాంతాల వారే ఓటింగ్‌లో పాల్గొంటున్నారు. తార్నాక డివిజన్‌లో కూడా ఓటింగ్‌శాతం మాత్రం చెప్పుకోదగిన స్థాయిలో జరగలేదు. ఇక్కడ సంపన్నులు నివసించే ప్రజలు పోలింగ్ కేంద్రాలవైపు కన్నెత్తి చూడడం లేదు. మాణికేశ్వరినగర్, లాలాపేట ప్రాంత బస్తీలు మినహా నాగార్జుననగర్, కింతీ కాలనీ, ఓయూ కాలనీలవాసులు ఓటింగ్‌లో పాల్గొనడం లేదు.

పోలింగ్ శాతం పెంచుతాం..



ఈ నెల 30న జరిగే ఎమ్మెల్యే ఎన్నికల్లో పోలింగ్ శాతం మునుపటికన్నా పెరిగే అవకాశం ఉంటుంది. కొత్తగా రూపొందించిన జాబితాలో 10 వేల వరకు కొత్త ఓటర్లను చేర్పించాం. ఇందులో మొత్తం యువకులే ఉన్న కారణంగా ఓటింగ్‌కు హాజరయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. గతంలో పోలింగ్ తక్కువ అయిన ప్రాంతాల్లో ఓటింగ్‌ను పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నాం.

–సుధాంశ్, ఈఆర్ఓ అధికారి

బీజేపీ జెండా ఎగరడం ఖాయం



ఎన్నికల ప్రచారం చేస్తున్న శ్రీగణేష్

రసూల్‌పురా: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరవేస్తామని బీజేపీ అభ్యర్థి శ్రీగణేష్ తెలిపారు. నియోజకవర్గంలోని మడ్‌ఫోర్ట్ శ్రీరాంనగర్, సిఖ్‌విలేజ్ హౌసింగ్ కాలనీ, అంబేడ్కర్‌నగర్ బస్తీల్లో శనివారం ఆయన బీజేపీ నాయకులతో కలసి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చేందుకు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు ప్రజలను మభ్యపెట్టే విధంగా హామీలిస్తున్నారని ప్రధాని మోదీ దేశంలో సుస్థిర పాలన అందజేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బీఎస్. శ్రీనివాస్, మహిళ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించండి



ప్రచారం చేస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

సనత్‌నగర్: నిస్వార్థ, అవినీతిరహిత పాలన అందించేందుకు బీజేపీని గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి శశిధర్‌రెడ్డి అన్నారు. సనత్‌నగర్ డివిజన్ దాసారం బస్తీ, రవీంద్రానగర్ ప్రాంతాల్లో శనివారంఆయన ఇంటింటి పాదయాత్ర చేసి కమలం గుర్తుపై ఓటేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి విశేష ఆదరణ వస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలు కేవలం బీఆర్‌ఎస్ వారికే అందుతున్నాయని స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రచారంలో శ్యాంసుందర్‌గౌడ్, అమీర్‌పేట కార్పొరేటర్ సరళ, నాయకులు క్రాంతికుమార్, దయానంద్, నరేందర్, బాలనర్సింహ్మ, ఉమ, నరేష్, లక్ష్మీనారాయణ, రాములు, శ్రీశైలం పాల్గొన్నారు.

తార్నాక డివిజన్‌లో కాంగ్రెస్ ప్రచారం



ఓటేయాలని అభ్యర్థిస్తున్న సంతోష్‌కుమార్

లాలాపేట: కాంగ్రెస్ పేదల పార్టీ అని, బలహీన వర్గాల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న కాంగ్రెస్‌ను ప్రజలందరూ ఆదరించాలని సికింద్రాబాద్ ఆ పార్టీ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం తార్నాక డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఇంటింటికి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. లాలాపేట, శాంతినగర్, బడి మజీద్, లిల్లీ మోడల్ స్కూల్ తదితర ప్రాంతాల్లో పర్యటించి ఓటర్లను కలిసి ఆరు గ్యారంటీలను వివరిస్తూ హస్తం గుర్తుకు ఓటేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనను చూసారని, ఇప్పుడు మార్పు కోసం ప్రజలంతా కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు చేసిన అభివృద్ధే నేడు కనిపిస్తుందన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పించాలని కోరారు. ప్రచారంలో అమీర్, హర్షద్, టిప్పు, యాదుల్లా, ఖాజ, అబీద్, జాన్, ఖాదర్, అయాన్ పాల్గొన్నారు.

టీటీడీ ఎల్‌ఏసీ కమిటీ సభ్యుడిగా రమణ



నియామకపత్రాన్ని అందుకుంటున్న రమణ


అడ్డగుట్ట: తిరుమల తిరుపతి దేవస్థానం లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా తుకారాంగేట్‌కు చెందిన సామాజిక సేవకుడు రమణ నియమితులయ్యారు. ఈ మేరకు టీటీడీ కమిటీ ప్రతినిధుల చేతుల మీదుగా శనివారం ఆయన నియామకపత్రాన్ని అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో కరోనా సమయంలో నిరుపేదలకు ఎన్నో సేవలందించడం, ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య పరికరాలు వితరణ చేయడం వంటివి చేశారు. వివిధ సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ప్రజల తనవంతు సహాయ సహకారాలు అందిస్తున్న రమణను గుర్తించి టీటీడీ లోకల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా నియమించారు.

ఓయూలో రంగవల్లి వర్ధంతి



రంగవల్లి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

లాలాపేట: పీడీఎస్‌యూ విజృంభణ ఆధ్వర్యంలో శనివారం ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట రంగవల్లి 24 వర్ధంతి నిర్వహించి రంగవల్లి చిత్రపటం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అల్లూరి విజయ్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నాయకులు రాకేష్, వెన్నెల, సందీప్, రాంబాబు, మానస, గీత, సాయి విద్య, రమ్య, అవంతి పాల్గొన్నారు.



పరేడ్‌గ్రౌండ్‌లో జరిగిన విశ్వరూప మహాసభకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. బేగంపేటకు చెందిన ఎమ్మార్పీఎస్ నేత ఈరం గారి రాములు ఆధ్వర్యంలో కార్లు, బస్సులు వివిధ వాహనాల్లో బయలుదేరారు. –సనత్‌నగర్

అభివృద్ధి చేశాం ఓట్లు అడిగే ధైర్యం మాకే ఉంది



బీఆర్‌ఎస్‌లో చేరిన బాపూనగర్ వాసులతో మంత్రి తలసాని

తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: గడిచిన తొమ్మిదిన్నర ఏళ్ల కాలంలోనే రాష్ట్రంలో అసలైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలయ్యాయని సనత్‌నగర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద అమీర్‌పేట డివిజన్ బాపూనగర్‌కు చెందిన పలువురు శనివారం బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి మంత్రి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారంతో సనత్‌నగర్‌లో గతంలో ఎన్నడూలేని విధంగాఅభివృద్ధి చేసినట్లు చెప్పారు. గతంలో ఇక్కడి నుంచి గెలిచిన పాలకులు నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యలను పట్టించుకోలేదని బాపూనగర్‌లో అనేక సమస్యలు ఉండేవని, తాము వచ్చిన తర్వాతనే అనేక అభివృద్ధి పనులు చేపట్టి సమస్యలను పరిష్కరించడం జరిగిందన్నారు. బస్తీలు, కాలనీలు అనే తేడా లేకుండా ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేసి ప్రజల ఇబ్బందులను చాలా వరకు దూరం చేశామన్నారు. తాము ఏమి చేశామో చెప్పి ప్రజలను ఓట్లు అడిగే ధైర్యం తమకు ఉందని, కాంగ్రెస్, బీజేపీ వాళ్లు ఏం చెప్పి ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం నుంచి ఎన్ని నిధులు తీసుకు వచ్చారో స్థానిక బీజేపీ నేతలు చెప్పాలన్నారు. జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులైన పార్టీలో చేరుతున్నారన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి..

కాంగ్రెస్ పార్టీకి చెందిన విశాల్ జాదవ్, మనోజ్ రాథోడ్, రాజేందర్ జాదవ్ ఆధ్వర్యంలో పలువురు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. అదే విధంగా బాపూనగర్‌కు చెందిన ప్రణీత్‌సింగ్, పవార్, కిషన్‌రాజ్ చౌహాన్, లక్ష్మీబాయి, కల్పన జాదవ్, పార్వతి రాథోడ్, సుభద్రకుమారి, స్వరూపలతో పాటు మరో 35 మంది పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, బాపునగర్ అధ్యక్షుడు హరిసింగ్, కిషన్‌సింగ్, మాజీ అధ్యక్షుడు రాకేష్‌జాదవ్, వీటీ నాయక్, మదన్‌సింగ్, గోపీచంద్‌లాల్ సింగ్, రాములు, వినోద్, లక్ష్మీబాయి పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీనివాసుని కల్యాణం



ప్రత్యేక పూజలు చేస్తున్న నోముల ప్రకాశరావు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండు కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత వెంకన్నస్వామి కల్యాణోత్సవం శనివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పట్టువస్త్రాలతో అలంకరించి, మేళతాళాలు, బాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమం చేపట్టారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరిన ముస్లిం మైనార్టీలు, ఆటోయూనియన్ ప్రతినిధులు

చిలకలగూడ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని సికింద్రాబాద్ ఆ పార్టీ అభ్యర్థి పద్మారావుగౌడ్ పేర్కొన్నారు. సీతాఫల్‌మండి డివిజన్ షాబాజ్‌గూడలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పలు పార్టీలకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు, ఆటో యూనియన్ కార్మికులు పెద్ద సంఖ్యలో బీఆర్‌ఎస్ చేరారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ.. సికింద్రాబాద్‌లో బీఆర్‌ఎస్ గెలుపు ఖాయమని, మెజార్టీ మరింత పెరగాలని అందుకు ప్రతి ఒక్కరు కారు గుర్తుకు ఓటేయ్యాలన్నారు. ముస్లిం మైనార్టీలు, ఆటో యూనియన్ నాయకులు, కార్మికుల అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మునావర్‌తో పాటు పెద్దసంఖ్యలో యువకులకు పద్మారావు బీఆర్‌ఎస్ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు శీలం సాయి నేతృత్వంలో వారాసిగూడ ఆటో యూనియన్ నాయకులు కరీం, అహ్మద్‌షరీఫ్, సయ్యద్ అసద్, మొయిన్ తదితరులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ నాయకులు రామేశ్వర్ కిరణ్,కిషోర్, త్రినేత్ర, చంద్రశేఖర్, నవీన్, మైనార్టీ సెల్ ప్రతినిధులు అఫ్జల్, షబ్బీర్, జహంగీర్, కలీం పాల్గొన్నారు.

మార్కెట్లకు దీపావళి శోభ



దొంతులు కొనుగోలు చేస్తున్న ప్రజలు

లాలాపేట: దీపావళి సందర్భంగా మార్కెట్లకు పండుగ శోభ సంతరించుకుంది. బొమ్మలు, పూలు, దొంతులు, పూజ సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్లు కళకళలాడుతున్నాయి. తార్నాక, లాలాపేట ప్రధాన రహదారికి ఇరువైపుల ప్రత్యేక దుకాణాలు వెలిసాయి. టపాసుల దుకాణాలను సైతం ఏర్పాటు చేశారు. ప్రజలంతా దీపావళి వేడుకలను ఆనందోత్సవాలతో జరుపుకునేందుకు ఇళ్లు, వ్యాపార సముదాయాలకు రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు.

కళాపీఠం పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న పగిడిపల్లి సురేందర్

లాలాపేట: ప్రముఖ కవి, రచయిత డాక్టర్ పగిడిపల్లి సురేందర్ తెలుగు సాహిత్య కళాపీఠం పురస్కారాన్ని అందుకున్నారు. శనివారం రవీంద్ర భారతిలో తెలుగు సాహిత్య కళాపీఠం 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో భాగంగానే సాహిత్య, సాంస్కృతిక రంగాల్లో చేస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా సురేందర్‌కు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పురస్కారం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

వృత్తి నైపుణ్యాలపై ఉచిత శిక్షణ



ఉచిత శిక్షణపై ప్రచారం చేస్తున్న టెక్‌మహీంద్ర, అప్సా ప్రతినిధులు

చిలకలగూడ: నిరుద్యోగ యువతకు వృత్తి నైపుణ్యాలపై టెక్ మహీంద్ర స్మార్ట్, అప్సా స్వచ్ఛంద సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నామాలగుండు, ఉప్పరి బస్తీ, బీదలబస్తీ, సీతాఫల్‌మండి తదితర ప్రాంతాల్లో శనివారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించి ఆయా ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించారు. టాలీ ప్రైమ్ అండ్ బీజీ అకౌంటింగ్, అడ్వాన్స్ ఎక్సెల్, కంప్యూటర్ బేసిక్స్, మైక్రోసాఫ్ట్ వర్డ్, పవర్ పాయింట్, కమ్యూనికేటివ్ ఇంగ్లిష్, ఇంటర్నెట్ పరిజ్ఞానం, ఇంటర్వ్యూ స్కిల్స్, ఇంగ్లిష్ టైపింగ్ తదితర వృత్తి నైపుణ్యాలపై ఉచిత శిక్షణ అందిస్తున్నట్లు వివరించారు. 18 నుంచి 27 ఏళ్ల వయస్సుండి ఇంటర్, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు అర్హులని, మరిన్ని వివరాలకు 9154990135 నంబర్‌లో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో టెక్‌మహీంద్ర ఇంగ్లిష్ ట్రైనర్ హరిప్రకాశ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ జయశ్రీ, కమ్యూనిటీ మొబలైజర్ విజయ్ పాల్గొన్నారు.

సెమీస్‌లో నర్సింహారెడ్డి జోడీ

లక్డీకాపూల్: హైదరాబాద్ ఓపెన్ టెన్నిస్ సంఘం (హెచ్‌ఓటీఏ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 15వ జాతీయ ఓపెన్ టెన్నిస్ టోర్నీలో నంద్యాల నర్సింహారెడ్డి, నీల్‌కాంత్ జోడీ జోరు కొనసాగుతోంది. పురుషుల 50 ప్లస్ డబుల్స్ విభాగంలో నంద్యాల, నీల్‌కాంత్‌లు అలవోకగా సెమీఫైనల్లో అడుగుపెట్టారు. శనివారం సికింద్రాబాద్‌క్లబ్‌లో జరిగిన క్వార్టర్ ఫైనల్లో శ్రీధర్, బాలరాజు జోడీపై 8–5తో గెలుపొందిన నర్సింహారెడ్డి, నీల్‌కాంత్‌లు టైటిల్‌కు మరింత చేరువయ్యారు. చంద్రశేఖర్ రెడ్డి, ఎల్. శ్రీధర్ సైతం 8–3తో శ్రీనివాస్, వెంకట్‌పై గెలుపొంది సెమీస్‌లో అడుగుపెట్టారు. మెన్స్ సింగిల్స్ విభాగంలో ఈశ్వర్ సాయి 8–4తో విశాఖ్‌పై, కన్నన్ 8–0తో హనుమాన్ రాముపై గెలుపొంది 30 ప్లస్ విభాగంలో సెమీస్‌కు చేరారు. 40 ప్లస్ సింగిల్స్‌లో అఫ్రోజ్ 8–1తో రవిని, నర్సింహులు 8–1తో వి. ప్రకాశ్‌ను ఓడించి సెమీస్‌లో ప్రవేశించారు. 50 ప్లస్ సింగిల్స్ క్వార్టర్ ఫైనల్స్‌లో చంద్రశేఖర్ రెడ్డి 8–5తో సుధాకర్‌పై, నీల్‌కాంత్ 8–0తో జి. శ్రీనివాస్‌పై, వెంకట మూర్తీ 8–4తో శివ రామరాజుపై విజయం సాధించారు. 60 ప్లస్ సింగిల్స్‌లో మెహర్ ప్రకాశ్ 8–3తో అర్జున్‌ను.. రామి రెడ్డి 8–3తో కె.పి రావును ఓడించగా, 70 ప్లస్ సింగిల్స్‌లో అంకయ్య 9–3తో రాజరత్నను, వి. గజపతి 9–2తో రాజగోపాలన్‌పై విజయం సాధించి సెమీస్‌కి చేరుకున్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.27, నల్లవంకాయ 13, పొడుగు వంకాయ 13, బెండకాయ 23, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 45, క్యాప్సికమ్ 33, పచ్చకాకర 20, పందిరి బీర 18, క్యాబేజీ 11, క్యారెట్ 35, దొండ 13, గుండుబీన్స్ 55, గింజ చిక్కుడు 45, గోకరకాయ 23.

నిరుద్యోగులూ ఆలోచించి ఓటు వేయండి: వీహెచ్

పంజగుట్ట: తెలంగాణ రాగానే ఇంటికో ఉద్యోగం, కేజీ టు పీజీ ఉచిత విద్య అని అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ఒకతరం నిరుద్యోగులను మోసం చేశారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. యువత మరోమారు మోసపోకుండా ఆలోచించి ఓటు వేయాలని ఆయన సూచించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ నిరుద్యోగ విద్యావంతుల సంక్షేమ సంఘం ఆవిర్భావ సభ నిర్వహించారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రంగసాయి భట్టు, వినోద్‌రావులతో కలిసి వీహెచ్ మాట్లాడుతూ... రాష్ట్రం వచ్చిన ఎనిమిదిన్నర సంవత్సరాల తర్వాత 15 నోటిఫికేషన్లు వేసి నిరుద్యోగుల నుంచి రూ. 220 కోట్లు దండుకుని పేపర్ లీకేజీలు, కోర్టు కేసులు వేసి ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం టీఎస్‌పీఎస్సీలో దరఖాస్తు చేసుకున్న వారే 45 లక్షల మంది ఉన్నారని ఇతర బోర్డుల్లో ఎంతో మంది దరఖాస్తులు చేసుకున్నారని వారు ఇప్పటికైనా ఆలోచించి ఓటు వేయాలని సూచించారు.

పకడ్బందీ ఏర్పాటు.. నిబంధనలు ఉల్లంఘిస్తే వేటు!

ఎన్నికలు సాఫీగా, సజావుగా జరిగేలా పోలీసు శాఖ ద్వారా పకడ్బందీ కార్యాచరణతో ముందుకు సాగుతున్నాం. ఎన్నికల నియామవళి సక్రమంగా అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి తమ డివిజన్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్ల పరిధిలో నిరంతరం తనిఖీలు, అభ్యర్థుల ప్రచారంపై ప్రత్యేక నిఘా ఉంచామని 'సాక్షి'తో నిర్వహించిన ముఖాముఖిలో వెల్లడించారు.

–బౌద్ధనగర్

- ఎన్నికలకు భారీ బందోబస్తు
- నియమాలు అతిక్రమిస్తే చర్యలే
- 'సాక్షి'తో చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి



ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఎన్నికల నియామవళి రాజకీయ పార్టీలు ఉల్లంఘించకుండా చూస్తున్నాం. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

ఎన్నికల తనిఖీలు ఎలా సాగుతున్నాయి?

ఎన్నికల సందర్భంగా తమ సిబ్బంది ఎక్కడికక్కడ తనిఖీలు చేస్తున్నారు. తమ పరిధిలో చిలకలగూడ, వారాసిగూడ, లాలాగూడ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. తమ సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. ఇందు కోసం వివిధ బృందాలు జిల్లా సరిహద్దుల్లో తనిఖీలు చేస్తున్నాయి.

రౌడీషీటర్లు, సంఘ విద్రోహశక్తుల పట్ల ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రౌడీషీటర్లు, సంఘ విద్రోహుల శక్తులపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇప్పటి వరకు సుమారు 40 రౌడీషీటర్లను బైండోవర్ చేశాం. అదే విధంగా పాత నేరస్తులపై నిఘా పెట్టాం.

ఎన్నికల బందోబస్తు గురించి..

ఎన్నికల సందర్భంగా గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నాం. ఆయా పోలింగ్ స్టేషన్ల వద్ద బందోబస్తుతో పాటు ఏరియాల్లో ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నాం. ముఖ్యంగా సీఐఎస్ఎఫ్ బలగాలు, సిటీ ఆర్మ్‌డ్, రిజర్వు, సీపీఐ అంబర్ సిబ్బందితో బందోబస్తు నిర్వహిస్తున్నాం. అనుమతి తీసుకోకుండా ప్రచారాలు నిర్వహించే కేసులు నమోదు చేస్తాం.

ప్రజలు, నాయకులకు మీరిచ్చే సూచనలు..

ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటు వేయడం ప్రజాస్వామ్య హక్కుగా భావించాలి. పోలింగ్ రోజు తప్పనిసరిగా కేంద్రానికి వచ్చి ఓటేయాలి. అదే విధంగా పార్టీలు, నాయకులు ఎన్నికల నిబంధనలు పాటించాలి. ప్రజలకు ఇబ్బంది, అసౌకర్యం కలుగకుండా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించుకోవాలి.